| VISAKHAPATNAM APARTMENT RESIDENTS' WELFARE ASSOCIATION (VARWA) | Greater Visakha Resident Colony Associations' Federation (NIVAS) |
|---|---|

**Visakhapatnam** **Date:**

**…………………………**

**…………………………**

**అయ్యా/ అమ్మా!**

**ఇటీవలి కాలంలో ఆస్తిపన్ను, చెత్త సమీకరణపై యూజర్ చార్జీల పెంపుదల నగర ప్రజలపై పిడుగుపాటులా పడ్డాయి. ఈ పన్నుల పెంపుదలపై జీవీఎంసీ పునఃపరిశీలించాలని అభిప్రాయ పడుతున్నాము.**

**ఆస్తి విలువ ఆధారంగా ఆస్తిపన్ను నిర్ణయించడం అసంబద్ధం ఎందుకంటే ఆస్తి విలువ ఆస్తిని అమ్ముకున్నప్పుడు మాత్రమే యజమానికి లభిస్తుంది. నెల నెలా లభించే ఆదాయం కాదు. ప్రతి సంవత్సరం చెల్లించాల్సిన ఆస్తిపన్ను ప్రతి ఏడాది లభించే ఆదాయం పైన ఉండాలి. అంతేగాని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వారి ఊహాజనిత లెక్కల ఆధారంగా కాదు. కాబట్టి సాలుసరి అద్దె ఆధారంగా ఇంటి పన్ను వసూలు చేయడమే సూత్రబద్ధం గా సరైనది.**

**ఆస్తి విలువ ఆధారంగా ఆస్తిపన్ను నిర్ణయించడం వలన ఆస్తిపన్ను భారీగా పెరిగింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వారు ప్రతి సంవత్సరం ఆస్తి విలువలు పెంచుతారు. దీనివల్ల ఆస్తి పన్ను ప్రతి సంవత్సరం పెరుగుతుంది. ఇది ప్రజలకి భరించలేని భారం అవుతుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న విధానం ప్రకారం ఐదేళ్లకొకసారి ఇంటి పన్నులు పెంచుతున్నారు. ప్రతి ఏడాది ఆస్తిపన్ను పెంచడం చాలా అన్యాయం.**

**2021 - 22 సంవత్సరానికి ఇంటి పన్ను ఏప్రిల్ 2021 లోనే చాలామంది చెల్లించేశారు. ఆగస్టు నెలలో జీవీఎంసీ కౌన్సిల్లో ఆస్తిపన్ను పెంపుదల నిర్ణయించడమైనది. కానీ ఈ పెంపుదల ఏప్రిల్ ఒకటి, 2021వ తేదీ నుండి అమల్లోకి తేవడం జరిగింది. ఇది కూడా అసంబద్ధమే ఎందుకంటే పన్నుల పెంపు పాత తేదీ నుంచి ఇంతవరకు ఎప్పడూ అమలు చేయలేదు. దీనివల్ల సకాలంలో చెల్లించిన వారు కూడా పెంచిన మొత్తాన్ని మళ్లీ చెల్లించాల్సి వస్తోంది.**

**జివిఎంసి వారు ఇంటింటికి ఇస్తున్న సవరించిన డిమాండ్ నోటీసులో లిమిటేషన్ క్లాజ్ ప్రకారం పాత పన్నుపై 15 శాతం పెంపుదల అమలు చేస్తున్నట్టుగా రాశారు. కానీ ఈ విధానం ప్రకారం కొత్త పన్ను స్థాయికి చేరుకునేంత వరకు ప్రతి సంవత్సరం 15 శాతం పెంచుతూనే ఉంటారు. చక్రవడ్డీ ప్రకారం ఐదేళ్లలో ఇది రెట్టింపవుతుంది. అంతేకాకుండా రిజిస్టర్**

ఆఫీస్ వారు పెంచినప్పడల్లా ఆస్తిపన్ను పెరుగుతూనే ఉంటుంది. ఐదేళ్లకొకసారి పెరగవలసిన ఇంటి పన్నును పెట్రోల్, డీజిల్ చార్జీల లాగా ప్రతి సంవత్సరం పెరిగే పద్ధతి మార్చడం చాలా అన్యాయం.

జీవీఎంసీ కమిషనర్ గారు ఇచ్చిన నోటిఫికేషన్ కి స్పందనగా వేలాది మంది ఆస్తిపన్ను విధాన మార్పును, పెంపుదలను వ్యతిరేకిస్తూ తమ అభ్యంతరాలను సమర్పించారు. అలాగే పదివేల మంది నగర ప్రజల సంతకాలతో వినతి పత్రాన్ని నగర మేయర్ గారికి వార్వా నివాస్ గా మేము సమర్పించాము. కానీ ప్రజా వ్యతిరేకతను పట్టించుకోకుండా జీవీఎంసీ కౌన్సిల్ ఆస్తిపన్ను పెంపుదలను ఆమోదించింది. ఇది అప్రజాస్వామికం. ఈ ఆస్తి పన్ను పెంపుదల, విధాన మార్పు లను రాష్ట్రంలోని అన్ని పట్టణాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. దీనిపై విజయవాడ టాక్స్ ప్లేయర్స్ అసోసియేషన్ హైకోర్టులో కేస్ 216 86 / 2021 వేశారు. ఈ కేసు పెండింగ్లో ఉంది. ఆస్తిపన్నుపై హైకోర్టు లో కేసు పెండింగ్ లో ఉండగా, సవరించిన ఆస్తిపన్ను నోటీసు జారీ చెయ్యడం న్యాయబద్ధం కాదు. ఈ కేసుపై హైకోర్టు న్యాయనిర్ణయం చేసేంతవరకు దీన్ని జీవీఎంసీ లో అమలు చేయరాదని కోరుతున్నాము.

జీవో 197, 198 లు భారీ పెనాల్టీ లకు తెరలేపాయి. కోవిడ్ కారణంగా ప్రజలు తమ ఆప్తులను కోల్పోయి, ఉపాధి కోల్పోయి నానా అవస్థలు పడుతున్నారు. ఉపాధి మెరుగుపడలేదు. చిన్న చిన్న వ్యాపారాలు పుంజు కోలేదు. ఈ పరిస్థితుల దృష్ట్యా మహా ముంబై, పూణే వంటి నగరాల్లో ఆస్తిపన్ను మినహాయింపు ఇచ్చారు. ఇక్కడ రాయితీలు, మినహాయింపు లకు బదులుగా భారీ పెనాల్టీ లు వేస్తున్నారు. కాబట్టి కొత్తగా తెచ్చిన ఆస్తి పన్ను విధానానికి బదులుగా పాత పద్ధతిలో ఇంటి పన్ను విధానాన్నే కొనసాగించాలని, ఈ అంశాన్ని జీవీఎంసీ కౌన్సిల్ లో పునఃపరిశీలన చేయాలని కోరుతున్నాము. ఈ అభిప్రాయాలను, మా విన్నపాలను తమరు జీవీఎంసీ కౌన్సిల్లో వినిపించి, ప్రజాభీష్టానికి తగినట్టుగా నిర్ణయం వచ్చేలా ప్రముఖ పాత్ర పోషించాలని కోరుకుంటున్నాం.

**చెత్త సేకరణపై యూజర్ చార్జీలు:**

చెత్త సేకరణపై యూజర్ చార్జీలు ఇంటింటికి ప్రతి నెల 120 రూపాయలు మరియు మురికివాడల్లోని ఇళ్లకు 60 రూపాయలు చొప్పన వసూలు చెయ్యాలని జీవీఎంసీ కౌన్సిల్ నిర్ణయించింది. నెలకు నూట ఇరవై రూపాయలు అంటే సంవత్సరానికి 1440 రూపాయలు అయింది. వాణిజ్య వర్గాలకు కూడా చెత్త చార్జీలు భారీగా విధించారు. ఇది తట్టుకోలేక తమ వ్యాపారాలు మూసుకునే పరిస్థితి దాపురించింది. ఇంత భారీ ఎత్తున చెత్త ఛార్జీలు వసూలు చేయాలని జీవీఎంసీ నిర్ణయించడం అన్యాయం. మంచినీటి సరఫరా, వీధిలైట్లు, రోడ్లు, కాలువలు, చెత్త సేకరణ వంటి పౌర సేవలు అందించేందుకు ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. నగర ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లిస్తూ జివిఎంసికి సహకారం అందిస్తున్నారు. చెత్త పన్ను ఇంటి పన్నులో ఇమిడి ఉండగా విడిగా చెత్త సేకరణ ఛార్జీలు వసూలు చెయ్యడం GVMC కి భావ్యం కాదు. ఇది ప్రజలను మోసగించడమే. పట్టణ ప్రజలకు సేవలందించడానికి స్థానిక సంస్థలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలి. ఇది రాష్ట్ర ప్రభుత్వ మరియు కేంద్ర ప్రభుత్వాల బాధ్యత. స్థానిక సంస్థలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించడం తగ్గించేసి, పన్నులు, ఛార్జీలు పెంచుకోమనడం మహా ఘోరం. ప్రజలను మిత్రులుగా భావించి, వారిని ఒప్పించి, వారు చెల్లించ గలిగే పన్నులు విధించాలి. కానీ, యూజర్ చార్జీలు, పెనాల్టీ లను చూస్తే ప్రజలను శత్రువులుగా గుర్తించి శిక్షిస్తున్నట్లుగా ఉంది.

90% మంది చెల్లించ నిరాకరిస్తున్న చెత్త సేకరణ ఛార్జీలను వెంటనే రద్దు చెయ్యాలి. మా విన్నపాలను తమరు జీవీఎంసీ కౌన్సిల్లో వినిపించి, ప్రజాభీష్టానికి తగినట్టుగా చెత్త ఛార్జీలను వెంటనే రద్దు చేసే దిశలో తమరు కృషి చెయ్యాలని కోరుచున్నాము.

అభినందనలతో

ఇట్లు

**వార్డు ప్రజలు.**